# తెలుగు వారి జ్ఞాన భాండారం




## వెబ్ వాచ్

ఆయన పేరు విశ్వనాథ కుటుంబ రావు. చేసేది సంస్కృత బోధన. భారత ప్రాచీన విజ్ఞానంపై ఆయనకు మంచి పట్టు ఉంది. ఆ విజ్ఞానాన్ని అందరికీ అందించాలన్న తపన ఉంది. అలా అని ఆయనను, పాత కాలపు మనిషి అని కొట్టి వేసేందుకు వీలు లేదు. ఆధునిక పోకడలు..అవసరాలు అన్నీ తెలిసిన వారాయన. స్పోకెన్ ఇంగ్లిష్‌పై మంచి పుస్తకం రాశారు. అలాగే ఆంగ్ల సంభాషణల మెలకువలపై 37 నిమిషాల వ్యవధి గల ఒక ఆడియో సీడీని రూపొందించారు. అందులో పెద్ద విశేషం ఏమిటన్న ప్రశ్న తలెత్తవచ్చు. అయితే.. ఆ పుస్తకాన్ని, సీడీని అవసరార్థులకు ఉచితంగా అందించాలని నడుం బిగించారు. అందుకోసం ఒక వెబ్‌సైట్‌ను రూపొందించారు. దాని పేరు http://www. upakari.com/

ఆ వెబ్‌సైట్ హోమ్‌పేజీని ఓపెన్ చేయగానే 'మై పబ్లిషింగ్స్' అనే ఉప శీర్షిక దర్శనమిస్తుంది. అందులో స్పోకెన్ ఇంగ్లిష్ ఈ-బుక్ కనిపిస్తుంది. పిడిఎఫ్ ఫార్మాట్‌లో ఉన్న ఆ పుస్తకాన్ని ఎవరైనా ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆ పుస్తకాన్ని తయారు చేసేందుకు ఆయన అయిదు సంవత్సరాలు శ్రమించారు. తొలుత దానిని ఆయన పుస్తక రూపంలో ప్రచురించారు. దానినే ఉన్నదున్నట్లుగా పిడిఎఫ్ ఫార్మాట్‌లోకి మార్చి అందరికీ అందుబాటులోకి తెచ్చారు. అలాగే స్పోకెన్ ఇంగ్లిష్‌కు సంబంధించిన సీడీ సైతం ఉంటుంది. దానినీ ఫ్రీగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆ రెండు విషయాలను పక్కనబెడితే.. అందులో 'మై లైబ్రరీ' అన్న శీర్షిక కింద అందరికీ ఉపయుక్తమయ్యే సమాచారాన్ని పొందుపరిచారు. పెద్ద బాలశిక్ష, సంస్కృత నిఘంటువు, తెలుగు మాధ్యమంలో సంస్కృత భాషణ, ఆక్స్‌ఫర్డ్ ఆంగ్ల నిఘంటువు లాంటివి లభ్యమవుతాయి.

విద్యా విషయాలతో పాటు అదనంగా 'గృహవైద్యం' పొందుపరిచారు. అనేక రుగ్మతలకు భారతీయ వైద్య విధానమైన ఆయుర్వేదం సూచించే పలు పరిష్కారాలను అందులో పొందుపరిచారు. అమెరికన్ ఆంగ్ల ఉచ్ఛారణను నేర్చుకోనేందుకు వీలుగా 'టాక్ కిట్'ను పొందుపరిచారు. ఒక్కటేమిటి?.. జనరల్ నాలెడ్జ్, వ్యక్తిత్వ వికాసం, వినోదం, ఆధ్యాత్మికం, మధుర గాయకుడు ఘంటసాల పాటలు..ఆరో తరగతి నుంచి పీజీ విద్యార్థి వరకు అవసరమైన జ్ఞాన సర్వస్వాన్ని పొందుపరిచారు. ఇంకా..వివిధ పత్రికల వెబ్‌లింక్స్, ఉచిత సేవలు, పోటీ పరీక్షలకు అవసరమైన సమాచారం అన్నింటినీ అందుబాటులో ఉంచారు. ఇది తెలుగు వారికి ఎంతో ఉపయుక్తమయ్యే మరో మంచి వెబ్‌సైట్. దానిని రూపొందించిన విశ్వనాథ కుటుంబ రావు శ్రమ, అంకితభావం ఎంతో ప్రశంసనీయం!

వెబ్‌సైట్: www.ibsindia.org

– దిక్సూచి డెస్క్